
# భగవంతుని జ్ఞాన యజ్ఞములో అమూల్యమైన రత్నము - 'ప్రకాశమణి దాదీగారు'

భారతదేశం గర్వించదగిన ఆధ్యాత్మిక వేత్తలలో ప్రకాశమణి దాదీగారు ఒకరు. ఆధ్యాత్మిక శక్తితో తాను సశక్తురాలవ్వడమే కాకుండా మహిళా లోకానికి కూడా ఆదర్శంగా నిలిచారు ప్రకాశమణి దాదీగారు. ప్రపంచంలోని షుమారు 130 దేశాలలోని లక్షలాది సోదరసోదరీమణులను వారు ఆధ్యాత్మికత వైపుకు ఆకర్షించారు. దాదీగారు తమలో ఉన్న సాటి లేని ఆధ్యాత్మిక ప్రతిభతో విలువలతో కూడిన సమాజ నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించారు. మంచి నాయకత్వ లక్షణాలు, ఆధ్యాత్మికతపై ఆసక్తి ప్రకాశమణి దాదీగారికి చిన్నతనం నుండే ఉండేవి. వారు తమ చిన్నతనంలోనే ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించారు. అప్పట్లో ఈ సంస్థను 'ఓం మండలి' అన్న పేరుతో పిలిచేవారు. 14 సంవత్సరాల చిరు ప్రాయంలోనే వారు తమ జీవితాన్ని మానవ జీవిత ఉద్ధరణ కోసం, ఈశ్వరీయ సేవ కోసం సమర్పించుకున్నారు. ఈ రోజు ప్రకాశమణి దాదీగారు మన మధ్యలో లేకున్నా కానీ వారి స్మృతులు దివ్యంగా, పదిలంగా అందరి మదిలో ఉన్నాయి. పేరుకు తగ్గట్టుగా దాదీగారు తమ కర్తవ్యాలతో ఎంతోమంది జీవితాలలో జ్ఞాన ప్రకాశాన్ని నింపి, వారిలోని నిరాశ నిస్పృహలను దూరం చేసారు. దాదీగారిచ్చే స్ఫూర్తి మానవులకు ఒక సద్గుణభరిత జీవితాన్ని, పవిత్ర అనుభూతిని పొందాలన్న ప్రేరణను కలిగించేది.



ఇటువంటి మహానుభావురాలి జన్మ 1922వ సంవత్సరంలో అప్పటి ఉమ్మడి భారతదేశంలోని సింధు ప్రాంతంలోని హైదరాబాదు పట్టణంలో జరిగింది. 1936వ సంవత్సరంలో, తమ 14వ ఏట, ప్రజాపిత బ్రహ్మా సాకార తనువులో అవతరించిన పరమాత్మ శివుడిని గుర్తించి తమ పూర్తి జీవితాన్ని భగవంతుడికి నివేదించుకున్నారు. తనలో అప్పటివరకు దాగి ఉన్న ప్రతిభతో, దివ్య దృష్టి, దివ్య బుద్ధితో దాదీగారు విశ్వంలోని నలుమూలల ఈశ్వరీయ సందేశాన్ని అందించే సేవలో ప్రముఖ పాత్రను పోషించారు. 1969వ సంవత్సరంలో ప్రజాపిత బ్రహ్మాగారు ఆధ్యాత్మిక కాగడాను ప్రకాశమణి దాదీగారికి అప్పజెప్పి వారు సంపూర్ణతను పొంది తమ శరీరాన్ని విడిచిపెట్టారు. దాదీగారు ఆ బాధ్యతలను ఎంతో చక్కగా నిర్వర్తించారు. దాదీగారి సమర్థవంతమైన నేతృత్వంలో ఈశ్వరీయ విశ్వ విద్యాలయం యొక్క చిగుర్లు అంతర్జాతీయ స్థాయిలో పెరగసాగాయి. అంతే కాకుండా, దాదీగారు 5000మందికి పైగా సమర్పిత బోధకురాళ్ళను తయారు చేయడంలో విజయవంతులయ్యారు.

దాదీగారి ప్రగతి పథంలో నిరంతరం పెరుగుతున్న సేవా కార్యక్రమాల వలన, వారి మేధా శక్తితో కూడిన నేతృత్వం వలన ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయానికి ప్రభుత్వేతర సంస్థ యొక్క హోదాను ఐక్య రాజ్యసమితి కేటాయించింది. ఈ సంస్థ ఐక్యరాజ్య సమితిలో ఆర్థిక, సామాజిక పరిషత్‌లో (ECOSOC) సలహాదారు సభ్యత్వం (CONSULTIVE STATUS) మరియు యునిసెఫ్ (UNICEF)తో కూడా అనుబంధం పొందింది. ఈ సంస్థ విశ్వ శాంతి కోసం అనేక సృజనాత్మక మరియు ప్రజోపయోగమైన కార్యక్రమాలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించింది. ఇటువంటి సేవా కార్యక్రమాలను గమనించిన ఐక్య రాజ్యసమితి, సంస్థకు 1987వ సం॥లో శాంతి పతకాన్ని బహుకరించింది. అంతే కాకుండా 5 జాతీయ శాంతిదూత పురస్కారాలను కూడా అందించింది. ఐక్యరాజ్య సమితితో అనుసంధానమై దాదీగారు అనేక అంతర్జాతీయ కార్యక్రమాలకు సూత్రధారులై ఆ సేవా కార్యక్రమాలన్నిటినీ చరితార్థం చేసారు, అవి:

1. అంతర్జాతీయ శాంతి సంవత్సరంలో మిలియన్ మినిట్స్ ఆఫ్ పీస్ అపీల్.
2. అంతర్జాతీయ యువకుల సంవత్సరంలో యువ ఉత్సవాలు మరియు పాదయాత్రలు
3. అంతర్జాతీయ మహిళ సంవత్సరంలో మహిళా జాగృతి మరియు సమ్మేళనాలు
4. అంతర్జాతీయ అక్షరాస్యత సంవత్సరంలో అనేక అక్షరాస్యత కార్యక్రమాల ఏర్పాటు

ఇటువంటి కార్యక్రమాలతో ప్రపంచంలోని నలు దిక్కులా వీటి ప్రభావం పడి ప్రజలందరిలో ఒక నూతన చేతనత్వము జాగృతి అయిందని చెప్పవచ్చు. ఆధ్యాత్మిక వెలుగును ప్రజల వద్దకు చేర్చే దిశలో దాదీగారు ఆకాశవాణి, వార్తపత్రికలు మరియు దూరదర్శన్‌లో ఎన్నో ఇంటర్వ్యూలను ఇచ్చారు. దాదీగారు జాతి, మత, కుల, వర్గ భేదాలను దూరం చెయ్యాలని మానవులందరిలో విశ్వ బంధుత్వాన్ని మేల్కొల్పే ప్రయత్నం చేసారు. దాదీగారి ఆధ్యాత్మిక ప్రస్థానంలోని కొన్ని సేవా మైలురాళ్ళు:

- చికాగోలో 1993, ఆగస్టు 31న విశ్వమత మహాసభల శత జయంతి ఉత్సవాలకు దాదీగారిని విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. దాదీగారు అక్కడ అధ్యక్ష సందేశాన్ని అందించారు.
- ఆధ్యాత్మిక మరియు నైతిక విలువల వికాసం కోసం దాదీగారు చేసిన విశేష కృషిని దృష్టిలో పెట్టుకుని ఉదయపూర్‌లోని మోహన్‌లాల్ సుఖాడియా విశ్వవిద్యాలయం దాదీగారిని డాక్టరేట్ బిరుదుతో సత్కరించింది.
- భారతదేశంలోని విభిన్న రాష్ట్రాల గవర్నర్లు దాదీగారికి రాజభవనాలలో ఆత్మీయ సత్కారం చేసారు. అందులో అప్పటి రాజస్థాన్ గవర్నర్ శ్రీ డా॥ ఎమ్. చెన్నారెడ్డిగారు ఒకరు.
- న్యూ యార్క్, లాస్ ఏంజిలిస్, సావో పాలో, నైరోబి వంటి వివిధ విదేశాల మేయర్లు దాదీగారిని 'సిటీ మెడల్', 'కీ టు సిటీ' మొదలైన బిరుదులతో సత్కరించారు.
- ఒరిస్సా, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, చండీగఢ్ వంటి రాష్ట్రాలు దాదీగారిని రాష్ట్ర అతిథిగా ఆహ్వానించాయి.
- మహారాష్ట్ర గవర్నర్ శ్రీ సి.సుబ్రహ్మణ్యం గారు ప్రియదర్శని అకాడమీలో ఏర్పాటు చేయబడ్డ సమావేశంలో విశ్వ శాంతి కోసం పాటుపడినందుకు దాదీగారికి జ్ఞాపికను బహుకరించారు.

మానవతను అంధకారం నుండి వెలుగు వైపుకు తీసుకువెళ్ళే ప్రయత్నంగా దాదీగారు రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రిసర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఈ ఫౌండేషన్‌లో సమాజంలోని విభిన్న వర్గాలకు సేవలనందించడమే ధ్యేయంగా పెట్టుకుని 19 వర్గాలను ఏర్పాటు చేసారు. విద్యా విభాగం, స్పార్క్ విభాగము, యువకుల విభాగము, ఆరోగ్య విభాగము, వ్యవసాయ విభాగము, సమాజ సేవ విభాగము మొ॥నవి. దాదీగారి కుశల నేతృత్వంలో, సంస్థ ముఖ్యాలయమైన మౌంట్ ఆబూలో విభిన్న క్షేత్రాలకు సంబంధించి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి. అక్షరాస్యులే కాక నిరక్షరాస్యులు కూడా భగవంతుని సందేశాన్ని పొందాలన్న విశాల దృక్పథంతో, ఆధ్యాత్మిక భావాలు ఉట్టిపడే మోడల్స్‌ను, చిత్రాలను దాదీగారు తయారు చేయించి అనేక ఆధ్యాత్మిక మేళాలు, మ్యూజియంలను ఏర్పాటు చేయించారు.

చరిత్రవంతులు, జాగరూకులు, నైతిక బలం నిండిన యువకులు సమాజానికి లభించాలి - ఈ లక్ష్యంతో అనేక హాస్టళ్ళను కూడా ఏర్పాటు చేసారు దాదీగారు. అంతర్జాతీయ స్థాయిలో విశ్వ సదన్, ఆక్స్‌ఫోర్డ్‌లో అఖిల విశ్వ విశ్రాంతి కేంద్రము తెరిచారు. న్యూయార్క్, చికాగో, సిడ్నీలలో కూడా ఇటువంటివి తెరిచారు. ఇంతటి ఘనమైన మనసు కలిగిన మహా మనిషి దాదీ ప్రకాశ్‌మణిగారు. వారి దృష్టి పడినంతనే దుఃఖము, అశాంతి, చింతలు మైళ్ళ దూరం పారిపోయేవి.

ప్రకాశమణి దాదీగారు 25 ఆగస్టు, 2007నాడు తమ భౌతిక శరీరమును విడిచి అవ్యక్త యాత్రకై ప్రస్థానమయ్యారు. శ్రద్ధామూర్తి దాదీగారు పవిత్రతకు ప్రతిరూపం. రాజయోగిని, తపస్విని ప్రకాశమణి దాదీగారు అవ్యక్తమైన ఆగస్టు 25వ తారీఖును 'విశ్వ బంధుత్వ దివసము'గా జరుపుకోబడుతుంది. ఇట్టి నారీ శిరోమణికి, మహా వనితకు ఈశ్వరీయ పరివారము మరియు సర్వ దేశ-విదేశాలవారి తరపున మా శతకోటి వందనములు.

- బ్రహ్మాకుమారీస్